సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 9 । జూన్ । 2024



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వి.మల్లపురాజు (హైదరాబాద్) శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



అయినవిల్లిలో రూ.20,117

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కుడుపూడి సందీప్ కుటుంబ సభ్యులు (అమలాపురం మండలం బండారు లంక) రూ.20,117 విరాళం అందజేశారు.

గరిష్టం/కనిష్టం 35.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	34.0	27.0
కాకినాడ	33.5	26.8
అమలాపురం	35.0	26.0

న్యూస్‌రీల్

జక్కంపూడి చిన్ని మృతి



చిన్ని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్. జక్కంపూడి చిన్ని (పాత చిత్రం)



రాజమహేంద్రవరం సిటీ: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన రావు సోదరుడు, సినీ ఎగ్జిబిటర్, రాజకీయ నాయకుడు జక్కంపూడి శ్రీనివాసరావు (చిన్ని) (64) రాజమహేంద్రవరం నారాయణపురంలోని తన నివాసంలో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్ని అంత్యక్రియలు కోటిలింగాలపేట శ్మశాన వాటికలో నిర్వహించారు. రాజకీయాల్లో సోదరుడు రామ్మోహనరావుకు చిన్ని చేదోడువాదోడుగా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నేతలు మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు చిన్ని నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, చిన్ని కుమారుడు దత్‌ను పరామర్శించి, సంతాపం తెలిపారు. నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్ కూడా చిన్ని పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

డెల్టాలకు 6,500 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. సముద్రంలోకి 1,257 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.60 అడుగులుగా నమోదైంది.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) ఆలయంలో స్వామివారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. ప్రాతఃకాలంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,84,380, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.50,357 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.

చిన వెంకన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో నిండిన అనివేటి మండపం

ద్వారకా తిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు ముగుస్తూండటంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూ లైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండన శాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులు ఆలయ ఆవరణలో పెద్ద సంఖ్యలో బారులు తీరారు. క్యూలైన్లలో ఉన్న వారికి దేవస్థానం సిబ్బంది నిరంతరాయంగా మంచి నీరు అందించారు. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు భక్తులను అలరించాయి. కొండ పైన ఘాట్ రోడ్డులో భక్తుల వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. హోం గార్డులు ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. క్షేత్రంలో సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది.



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ బయట బారులు తీరిన భక్తులు

గత చరితకు దర్పణం

- బ్రిటిష్ జ్ఞాపకాలకు నెలవు
- ఇక్కడే కాటన్ హయాంలో ఉపయోగించిన పరికరాలు
- నాటి రికార్డులు, వస్తువులు పదిలం
- శెట్టిపేట ఇరిగేషన్ కార్యాలయం ప్రత్యేకత

నిడదవోలు: శతాబ్దానికి పైబడిన ఘన చరిత్రకు నేటికీ సజీవ దర్పణంగా నిలుస్తోంది నిడదవోలు మండలం శెట్టిపేట వద్ద ఉన్న జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) కార్యాలయ భవనం. ఇందులో గత చరితకు సంబంధించిన ఎన్నో సాక్ష్యాలు నేటికీ పదిలంగా ఉన్నాయి. గోదావరి ఆయకట్టు మూడు డెల్టాలుగా ఉన్న విషయం తెలిసిందే. ఇందులో తూర్పు డెల్టా కాకినాడ, కోనసీమ జిల్లాలు, మధ్య డెల్టా కోనసీమ జిల్లా పరిధిలో ఉన్నాయి. సుమారు 5.30 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన పశ్చిమ డెల్టా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో విస్తరించి ఉంది. మొత్తం గోదావరి డెల్టా ఆయకట్టులో దాదాపు సగం పశ్చిమ డెల్టాలోనే ఉంది. ఇంత కీలకమైన పశ్చిమ డెల్టా ఆయకట్టుకు గుండెకాయ జలవనరుల శాఖ ఈఈ కార్యాలయం నిడదవోలు పట్టణానికి చేరువన శెట్టిపేట వద్ద ఉంది. బ్రిటిష్ హయాంలో ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ గోదావరిపై బ్యారేజీ నిర్మించారు. ఆ నదీ జలాలను ఒడిసిపట్టి, ప్రధాన కాలువలు, పంట కాలువలు, పిల్ల కాలువలు, డ్రెయినేజీలతో డెల్టా వ్యవస్థకు రూపుదిద్దిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్. ఆయన హయాంలోనే ఈ కార్యాలయాన్ని నిర్మించారు.

పక్కన 1870లో ఈ భవన నిర్మాణం ప్రారంభించారు. ఈ పనులు 1892లో పూర్తయ్యాయి. ఈ భవనం గోడలను రాయి, నాటు కోడిగుడ్ల సొన కలిపిన గానుగ సున్నంతో నిర్మించారని ఇక్కడ పని చేసిన విశ్రాంత ఉద్యోగులు చెబుతున్నారు. కార్యాలయం పై కప్పు నిర్మాణానికి బర్మా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కలపను ఉపయోగించారు. అప్పట్లో ఎంతో నాణ్యతతో నిర్మించడంతో 131 ఏళ్లు గడచినా ఈ భవనం ఇంకా చెక్కు చెదరకుండా ఉంది. పై నుంచి చూస్తే ఈ కార్యాలయం శిలువ ఆకృతిలో కనిపిస్తుంది. అప్పట్లో బ్రిటిష్ వారు ఎటువంటి కట్టడం నిర్మించినా దానిని ఇదే ఆకారంలో నిర్మించేవారని అంటారు.



బ్రిటిష్ కాలం నాటి తక్కెడ

ఇదీ ప్రాధాన్యం

గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలోని 5.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి నియంత్రణ పూర్తిగా ఈ కార్యాలయ పర్యవేక్షణలోనే జరుగుతుంది. అంతేకాకుండా పశ్చిమ డెల్టా పరిధిలోని నాలుగు సబ్ డివిజన్లలో పనుల అంచనాలు రూపొందించడం, కాలువ పనుల పర్యవేక్షణ, ధవళేశ్వరం హెడ్ వర్క్సు పర్యవేక్షణలో శివారు భూములకు సాగునీటి విడుదల వంటి కార్యకలాపాలను ఇక్కడి నుంచే నిర్వహిస్తారు.

ఘన చరిత్రకు సజీవ సాక్ష్యాలు

- కాటన్ దొర హయాంలో వినియోగించిన పలు వస్తువులు ఇప్పటికీ ఈ భవనంలో పదిలంగా ఉన్నాయి. వీటిల్లో పలు వస్తువులను ఇప్పటికీ సిబ్బంది ఉపయోగించుకుంటున్నారంటే ఇవి ఎంత నాణ్యమైనవో అర్థం చేసుకోవచ్చు.
- 1871లో అప్పటి మొదటి బ్రిటిష్ ఇంజినీర్ జీఐ వాల్క్ నుంచి ఇప్పటి వరకూ గోదావరి డెల్టాకు సంబంధించిన రికార్డులు ఈ కార్యాలయంలో భద్రంగా ఉన్నాయి.
- నాడు ఏర్పాటు చేసిన ఫర్నిచర్ ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది.
- అప్పట్లో ఏర్పాటు చేసిన ఫ్యాన్లను కార్యాలయం సిబ్బంది నేటికీ దర్జాగా ఉపయోగిస్తున్నారు.
- ఆ రోజుల్లో వాడిన తక్కెడ కూడా చెక్కుచెదరకుండా ఉంది.
- ఈ కార్యాలయంలోని బీరువాకు వేసిన తాళం కప్ప ఎటువంటి మరమ్మతులూ లేకుండా నేటికీ పని చేస్తూండటం విశేషం. ఈ తాళం కప్పపై లండన్ దేశపు ముద్రతో విక్టోరియా స్ట్రీట్ అనే పదాలు కనిపిస్తాయి. దీనిపై 863775 అనే నంబర్ కూడా ఉంది. అప్పటిలో ఈ నంబర్ల ఆధారంగానే వస్తువులను దిగుమతి చేసుకునే వారని చెబుతారు. ఈ తాళం కప్పకు ఇప్పటి వరకూ తుప్పు కూడా పట్టకపోవడం దీని నాణ్యతకు నిదర్శనం.
- కార్యాలయానికి వచ్చిన వారు ఇక్కడి తాళం కప్పను, నాటి ఫ్యాన్లను నేటికీ వినియోగించడం చూసి ఆశ్చర్యపోతూంటారు.
- ఈ భవనంలో సుమారు 9 అడుగుల ఎత్తున ఉన్న బీరువాలు కూడా ఇప్పటికీ వినియోగంలో ఉంది. దీనికి చెదలు కూడా పట్టకపోవడం విశేషం.
- నాడు పూర్తి ఐరన్‌తో తయారు చేసిన బోషాణాన్ని కూడా ఇక్కడి సిబ్బంది ఇప్పటికీ నిక్షేపంలా ఉపయోగించుకుంటున్నారు. గోడలో 10 అంగుళాల లోపలకు ఈ బోషాణాన్ని అమర్చారు. దీనిపై గుర్రం, సింహం గుర్తులతో ఉన్న రాజముద్రను ముద్రించారు. అప్పట్లో బ్రిటిష్ వారు ఈ రాజముద్ర ద్వారా పరిపాలన సాగించినట్లు పూర్వపు ఉద్యోగులు చెబుతున్నారు. అప్పట్లో డీడీలు, చెక్కులు, చలానాలు, నగదు, పనుల మంజూరు పత్రాలను ఈ బోషాణంలో దాచేవారు.
- అలాగే, అప్పట్లో ఉపయోగించిన తక్కెడ కూడా ఈ కార్యాలయంలో ఇప్పటికీ ఉంది.
- 1908లో అప్పటి బ్రిటిష్ ఇంజినీరు జీఎం లేసె కుటుంబ సభ్యులు మరణించగా.. కార్యాలయం సమీపాన నిర్మించిన సమాధి ఇక్కడ ఉంది. ఆ బ్రిటిష్ ఇంజినీర్ కుటుంబ సభ్యులు కొంత కాలం ఇక్కడకు వచ్చి నివాళులర్పించే వారని సీనియర్ ఉద్యోగులు చెబుతున్నారు.



శెట్టిపేటలోని ఇరిగేషన్ ఈఈ కార్యాలయం



నేటికీ వినియోగంలో ఉన్న తాళం కప్ప



ఈఈ కార్యాలయంలో గోడలో అమర్చిన బోషాణం

ఇంజినీర్ల బంగ్లా

శెట్టిపేటలోని ఇరిగేషన్ ఈఈ కార్యాలయం సమీపాన ఉన్న ఇంజినీర్ల రెండంతస్తుల బంగ్లా ఇప్పటికీ పదిలంగా ఉంది. దీని నిర్మాణంలో బర్మా నుంచి తీసుకుని వచ్చిన కలపను ఎక్కువగా ఉపయోగించారు. కొద్దిపాటి మరమ్మతులు చేయడం మినహా ఈ బంగ్లా ఇప్పటికీ ఎంతో పటిష్ఠంగా ఉంది. ఈఈలుగా ఎవరు వచ్చినా ఇక్కడ నివాసం ఉండాల్సిందే. దీంతో ఇది ఇంజినీర్ల బంగ్లాగా పేరొందింది. జిల్లాలో శివారు భూములకు సాగునీటి సరఫరా, వేసవిలో మంచినీటి చెరువులకు నీటి మళ్లింపు, నీటి విడుదల క్రమబద్ధీకరణ, గోదావరి జలాల పర్యవేక్షణ వంటి కీలక విధులను ఈ బంగ్లా నుంచే నిర్వహిస్తారు.

ఇంజినీర్ల బంగ్లా



హామీలు నెరవేర్చకుంటే ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- ప్రజలకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటాం
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కొద్ది నెలల సమయం ఇస్తామని, నెరవేర్చని పక్షంలో నిలదీస్తామని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నేత మార్గాని భరత్ రామ్ అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కష్టపడి పని చేశామన్నారు. ప్రజల అభిమానం ఎందుకు పొందలేదన్నదీ అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రజల వెంటే ఉంటూ, వారి సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగిందే చెబుతారని, అంతే కానీ అధికారం కోసం ప్రజలకు లేనిపోని ఆశలు చూపడం ఆయనకు అలవాటు లేదని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఏ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందో వచ్చే అయిదారు నెలల్లోనే తెలుస్తుందన్నారు. తమకు ఓటు వేసిన ప్రజలకు, పార్టీ కోసం శ్రమించిన శ్రేణులకు ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వం మంచి చేస్తే అభినందిస్తామని, చేయకుంటే నిలదీస్తామని అన్నారు.

జగన్‌తోనే ప్రయాణం

తన ప్రయాణం ఎప్పుడూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అని భరత్‌రామ్ స్పష్టం చేశారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి టీడీపీ ఎంపీ మురళీమోహన్ హయాంలో మంజూరైందన్నారు. అప్పుడే రద్దు కూడా అయ్యిందన్నారు. తాను కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తిరిగి మంజూరు చేయించానన్నారు. వాస్తవాలను చెరిపేయాలనే ఉద్దేశంతో శిలాఫలకాలు ధ్వంసం చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి శాంక్షన్ అయిందో, ఎప్పుడు పనులు ప్రారంభమయ్యాయో నగర వాసులందరికీ తెలుసునన్నారు. నగరానికి మరో నాలుగు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, ఔటర్ రింగ్ రోడ్ మంజూరయ్యాయని, వాటిని పూర్తి చేసే బాధ్యత ఎంపీ పురందేశ్వరిదేనని అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్ నెరవేర్చుకునే అసలైన సమయం, అవకాశం వచ్చిందని, దీనిపై టీడీపీ ఎటువంటి కృషి చేస్తుందో చూడాలని అన్నారు. బీజేపీకి ఇప్పుడు టీడీపీ, జనసేన ఎంపీల మద్దతు చాలా ముఖ్యమని, ఇటువంటి తరుణంలో రాష్ట్ర విభజన హామీల అమలుకు ప్రధానిపై ఒత్తిడి తెస్తే తప్పక సాధ్యమవుతాయని భరత్ అన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నేతలు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరుని ఆలయం శనివారం అశేష భక్తజనంతో పోటెత్తింది. గోవింద నామస్మరణ మార్మోగింది. ఉదయమే స్వామివారికి మేలుకొలుపు అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేశారు. గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పులకించారు. ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న క్షేత్ర పాలకుడు శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా స్వామివారికి సుమారు రూ.40,36,722 ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో వేలాదిగా స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

కొబ్బరికి కొత్త ఊపిరి



- పాత చెట్ల స్థానంలో కొత్తవి నాటేందుకు అవకాశం
- జిల్లాలో వెయ్యి హెక్టార్లలో ఆర్‌అండ్‌ఆర్
- హెక్టారుకు రూ.53,500 రాయితీ వర్తింపు

సాక్షి, అమలాపురం: కర్ణుడి చావుకు వెయ్యి కారణాలు అన్నట్టుగా కొబ్బరి సంక్షోభానికి కారణాలు అనేకం. కొబ్బరి కాయల దిగుబడి తగ్గడం.. కొబ్బరి (చిప్ప) దిగుబడి మందగించడం.. నాణ్యత లేకపోవడం.. పరిపక్వత లేని కొబ్బరి కాయలను దింపుగా తీయడం.. ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే కొబ్బరి కాయ సైజు చిన్నగా ఉండడం.. ఉత్తరాది ఎగుమతుల్లో వెనుకబడడం.. చెట్లను ఆశించే తెగుళ్లు.. వివిధ రకాల పురుగులు.. చెప్పుకొంటూ పోతే ఎన్నెన్నో. అయినా అంతిమంగా కోనసీమ జిల్లాలో వయసు మళ్లిన కొబ్బరి తోటలు ఉండడమే ప్రధాన సమస్య.

దేశవాళీ కొబ్బరి చెట్టు (ఈస్టుకోస్టాల్) వయసు వందేళ్లు. కానీ 60 ఏళ్ల వరకూ మాత్రమే పూర్తిస్థాయి దిగుబడి వస్తోంది. తరువాత తగ్గిపోతుంది. జిల్లాలో 1.03 లక్షల కొబ్బరి తోటలు ఉండగా, మరో 25 వేల ఎకరాలకు సరిపడా కొబ్బరి చెట్లు ఇళ్ల వద్ద, తోటలు, చెరువు గట్లు, రోడ్ల వెంబడి ఉన్నాయి. ఇప్పుడున్న తోటల్లో 90 శాతం దేశవాళీ రకం కాగా, ఇందులో 50 శాతానికి పైగా తోటలు ఇవే రకాలు ఉండడం గమనార్హం. దేశవాళీ రకం సగటు దిగుబడి చెట్టుకు ఏడాదికి సగటున 70 కాయల వరకూ వస్తాయి. ఇంతకన్నా అధికంగా దిగుబడి ఇచ్చే సంకర జాతి (హైబ్రీడ్) రకాలు ఉన్నాయి. ఇందులో గోదావరి గంగ ఒకటి. ఇది సగటున 140 కాయల వరకూ దిగుబడి ఇస్తోంది.

దిగుబడి పతనం

గతంలో ఎకరాకు 1,200 వరకూ కొబ్బరి కాయల దిగుబడి వచ్చేది. ఇప్పుడు 600 నుంచి 800 కాయలకు పడిపోయింది. 45 రోజులకు ఒకసారి చొప్పున సగటు ఎనిమిది దింపులు వచ్చేది. అది కాస్తా ఇప్పుడు 60 రోజులకు ఒకసారి ఆరు దింపులకు మాత్రమే పరిమితమైంది. ఈ విధంగా చూస్తే గతంలో 9,600ల కాయలు దిగుబడిగా వస్తే, ఇప్పుడు కేవలం 4,800 కాయలు మాత్రమే వస్తోంది. కాయలో కొబ్బరి సైతం తగ్గిపోతోంది. దేశవాళీ రకంలో 125 గ్రాముల వరకూ ఉండేది. దీని నుంచి 64 శాతం నూనె ఉత్పత్తి అయ్యేది. కానీ ఇప్పుడు 100 గ్రాములకు పడిపోయిందని, నూనె శాతం 61 మాత్రమే వస్తుందని అంచనా.

తోటలు పునరుద్ధరించాల్సిందే..

జిల్లాలోని తోటల్లో చాలా వరకూ కొబ్బరి చెట్లు తొలగించాల్సిందేనని నిపుణుల అంచనా. ఒకేసారి తోటలు తొలగిస్తే ఐదేళ్ల పాటు ఆదాయం కోల్పోయే అవకాశం ఉంది. అలా కాకుండా దిగుబడి తక్కువగా వస్తున్న చెట్లను గుర్తించి తొలిగించి కొత్తవాటిని వేయాల్సి ఉంది. గతంలో 45 ఏళ్ల పైబడి వయసున్న తోటల్లో కొబ్బరి చెట్ల మధ్య కొత్తగా కొబ్బరి మొక్కలు వేసేవారు. ఇప్పుడు రైతులు ఈ విధానానికి దూరంగా ఉంటున్నారు. ఇలా దిగుబడి లేని చెట్ల తొలగింపు చాలా కాలంగా నిలిచిపోయింది. దీనివల్ల రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.

ఆర్‌అండ్‌ఆర్‌తో మేలు

కోకోనట్ బోర్డు (సీడీబీ) రీ ప్లాంటేషన్ అండ్ రిజునువేషన్ (ఆర్‌అండ్‌ఆర్) పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా దిగుబడి తక్కువగా వచ్చే చెట్లను, తెగుళ్లు, పురుగులు ఆశించిన చెట్లను, పిడుగుపాటుకు గురై దెబ్బతిన్న చెట్లను తొలగించి కొత్తవి నాటుకోవచ్చు. గతంలో సీడీబీ నేరుగా అమలు చేసే ఈ పథకాన్ని ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో ఉద్యాన శాఖ ద్వారా చేపడుతున్నారు. చెట్లను తొలగించడం, వాటి స్థానంలో కొత్తవి నాటుకోవడం, వాటికి రెండేళ్ల పాటు ఎరువులు ఉచితంగా అందించడం ఈ పథకం ఉద్దేశం. చెట్టు తొలగింపునకు రూ.వెయ్యి చొప్పున రాయితీ అందిస్తారు. దీనికి హెక్టారు పరిమితి కాగా, హెక్టారుకు 32 చెట్లను తొలగించుకునే సౌలభ్యం రైతుకు ఉంది. ఇందుకు గాను రూ.32 వేలు రాయితీగా అందుతోంది. దీనితోపాటు కొత్తగా నాటుకునేందుకు చెట్టుకు రూ.40 చొప్పున హెక్టారుకు 100 చెట్ల వరకూ రైతుకు రూ.4 వేలు, ఎరువులు హెక్టారుకు ఏడాదికి రూ.8,750 చొప్పున రెండేళ్లకు గాను రూ.17,500 చొప్పున మొత్తం రూ.53,500 అందజేయనున్నారు.

పెద్ద ఎత్తున కేటాయింపులు

జిల్లాలో ఈ ఏడాది వెయ్యి హెక్టార్లలో పథకం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యానశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా జిల్లాకు పెద్దఎత్తున కేటాయింపులు జరిగాయి. గతంలో జిల్లాకు కేవలం 400 హెక్టార్లకు మించి ఇచ్చేవారు కాదు. కానీ ఈసారి వెయ్యి హెక్టార్లకు అనుమతి వచ్చింది. అర ఎకరం, ఎకరం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సైతం అమలు చేస్తున్నారు. అందుకు తగినట్టుగా రాయితీ అందజేయనున్నారు.

ఇక్కడ తక్కువే...

కోనసీమ జిల్లాతో పోలిస్తే కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొబ్బరి సాగు తక్కువ. కాకినాడ జిల్లాలో తుని, కత్తిపూడి మండలాల్లో కేవలం 1,482 ఎకరాల్లో సాగు జరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండ, చాగల్లు, కొవ్వూరు, ద్వారకాతిరుమల, నిడదవోలు, గోపాలపురం మండలాల్లో 19,838 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ జిల్లాలో 51.14 హెక్టార్లలో ఆర్‌అండ్‌ఆర్ పథకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



ఆర్‌అండ్‌ఆర్ పథకంలో కొబ్బరి చెట్ల తొలగింపు పనులు (ఫైల్)


రైతులకు ఎంతో లబ్ధి



ఆర్‌అండ్‌ఆర్ జిల్లాకు ఇంత పెద్దఎత్తున రావడం ఇదే తొలిసారి. ఉద్యాన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తక్కువ దిగుబడి ఇచ్చే చెట్లను తొలగించి మేలైన వంగడాలను నాటుకోవచ్చు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులు సైతం లబ్ధి పొందవచ్చు. అవసరమైన వారు స్థానిక ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి.

– బీవీ రమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

అన్నివిధాలా లాభం



45 ఏళ్ల వయసున్న తోటలను ముందుగానే గుర్తించాలి. అందులో దిగుబడి తక్కువగా ఉన్న చెట్లను గుర్తించి వాటి సమీపంలో కొత్తవి పెంచుకోవాలి. అవి పక్వానికి వచ్చిన తరువాత ముదుర చెట్లను తొలగించాలి. ఇది చాలా మంచి మార్గం. ఇందుకు ఆర్‌అండ్‌ఆర్ స్కీమ్ అన్ని విధాలా మేలు చేస్తోంది. కానీ చాలా మంది చెట్లను నరికి మొదలు వదిలేస్తున్నారు. దీనివల్ల కొమ్ము పురుగు వాటిలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఉన్న చెట్లను నాశనం చేస్తాయి. మొత్తం చెట్టును తొలగించాలి.

– ఎన్‌బీవీ చలపతిరావు, అధిపతి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉద్యాన పరిశోధనా స్థానం, అంబాజీపేట

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి పెయింటర్ దుర్మరణం

జగ్గంపేట: జగ్గంపేట శివారు గుర్రంపాలెం రోడ్డులోని రైస్ మిల్లులో పెయింటింగ్ పనులు చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ గురై మరణించాడు. ఎస్సై నాగార్జునరాజు కథనం ప్రకారం.. ఈ నెల 6న రాయవరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, అతనితో పాటు కొంతమంది జగ్గంపేటలోని బాలాజీ రైస్ మిల్లులో పెయింటింగ్ పనులు చేయడానికి వచ్చారు. పెయింటింగ్‌తో పాటు మరోపక్క రైస్ మిల్లులో వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. శనివారం సత్యనారాయణ పెయింటింగ్ పనులు చేస్తూ ఇనుప నిచ్చెన జరుపుతుండగా, అక్కడే వెల్డింగ్ తీగకు నిచ్చెన తగలడంతో విద్యుదాఘాతానికి గురై అతను అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి కుమారుడు పి.సత్య దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఒడిశా కార్మికుడి మృతి


సపారి కిశోర్ (ఫైల్)

యానాం: యానాం శ్రీవేంకటేశ్వరస్వామి నూతన దేవాలయం పనులకు వచ్చిన ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఆ వివరాల ప్రకారం.. ఆలయం వద్ద బోర్లు తీసే పనులకు ఒడిశా రాష్ట్రం నుంచి కొంతమంది యువకులు వచ్చారు. శనివారం పనులు ముగించుకుని తిరిగి ఒడిశాకు పయనమై కాకినాడ రైల్వే స్టేషన్‌కు ఆటోలో వెళుతుండగా పి.మల్లవరం వద్దకు వచ్చేసరికి అందులో ఉన్న సపారి కిశోర్ (31)కు తీవ్ర గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. దీంతో వారిని ఆటోడ్రైవర్ అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. అనంతరం సహచరులు యానాంలో ఉన్న మిత్రులకు ఫోన్ చేసి బైక్‌పై కిశోర్‌ను యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు రాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తమతో అప్పటివరకూ ఉన్న సహచరుడి మృతితో మిగిలిన కార్మికులు బోరున విలపించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

యువతి అదృశ్యం

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి శివారు ఆదిమూలంవారి పాలెంలో శనివారం అర్ధరాత్రి ఓ యువతి (18) ఇంటి నుంచి అదృశ్యమైంది. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు.

భూసారం.. పంటకు ఆధారం

- సమీకృత సాగు, పంట మార్పిడితో మేలైన దిగుబడులు
- చీడపీడల నుంచి రక్షణకు సరైన మార్గం
- ఎరువులు, మందుల ఖర్చు ఆదా


పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



కాకినాడ జిల్లాలో సమీకృత సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ సిబ్బంది

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): భూసారం... పంటకు ఆధారం. సాగులో మెళకువలతో భూమికి వస్తోంది పునరుజ్జీవం. పంట మార్పిడి విధానంతో సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి. తద్వారా నిత్య నూతనంగా పంటలకు అనుకూలంగా భూమి తయారవుతోంది. సమీకృత సాగు, పంట మార్పిడి విధానాలతో కలిగే లాభాలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. వీటిని ఆచరిస్తే మేలైన దిగుబడులతో పాటు చీడపీడలు, నష్ట నివారణ సాధ్యమని చెబుతున్నారు.

పంట మార్పిడి.. భలే దిగుబడి

సాగులో పంట మార్పిడి విధానంతో చీడపీడల సమస్యను అధిగమించవచ్చు. ఒక పంటను ఆశించే తెగుళ్లు రెండో పంటను ఆశించవు. ఈ విధానం ద్వారా ఏడాదికి రెండు, మూడు పంటలను వేస్తే, ఏదైనా ఒక పంటకు గిట్టుబాటు ధర లేకున్నా వేరే పంటల వల్ల లాభం పొందవచ్చు. వివిధ పంటల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు. రైతులంతా ఒకే రకమైన పంట వేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుంది. తద్వారా దిగుబడి తగ్గడమే కాక మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించదు.

- పంట మార్పిడితో సస్యరక్షణ కోసం వాడే పురుగు మందుల ఖర్చు తగ్గించవచ్చు. వేర్లు భూమిలో తక్కువ లోతుకు చొచ్చుకుపోయే పైర్లను పంట మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ పోషకాలను సమర్థంగా వినియోగించుకుంటాయి.
- పత్తి వేసిన పొలంలో మిరప సాగుచేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. మిరప పంట సాగు చేయడానికి ముందు ఆ భూమిలో జనుము, పిల్లి పెసర వంటి పంటలను సాగు చేసి, దాన్ని ట్రాక్టర్ ద్వారా తొక్కించిన తర్వాత సాగు చేస్తే భూసారం పెరిగి చీడపీడలు దరిచేరవు. పురుగులు ఉన్న ప్రాంతాల్లో టమోటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు. వాటిని వేస్తే పురుగులు మరింత అభివృద్ధి చెందుతాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే పంటలు ఎంపిక చేసుకోవాలి. వేరుశెనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలను కానీ నూనె గింజల పంటలను కానీ సాగు చేయడంతో తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి. భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వచేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకోవచ్చు.
- తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగు చేసుకోవచ్చు. కంది పంటను సాగు చేయడం వల్ల నేలపై పైరు ఆకులు రాలి కుళ్లిపోవడంతో భూసారం వృద్ధి చెందుతుంది.

సమీకృత సాగు.. బాగు

సమీకృత సాగుతో అనేక లాభాలు పొందవచ్చు. ఈ విధానంపై రైతన్నలు దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కాకినాడ జిల్లాలోని అన్ని మండలాల్లో సమీకృత వ్యవసాయంతో కలిగే లాభాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. ఒక ఎకరంలో ఫిష్‌కల్చర్, వరి, కోళ్లఫారం, కూరగాయలు పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో బోర్లు అందుబాటులో ఉన్న రైతులు వరికి బదులు రాగులు, కొర్రలు, జొన్న, మొక్కజొన్న, సజ్జలు సాగు చేసుకోవచ్చు. వరి పంట సుమారు 120 నుంచి 150 రోజులకు వస్తుంది. అదే చిరు ధాన్యాలు 90 రోజుల్లో పంట పూర్తయ్యి సంవత్సరానికి మూడు పంటలు వేసుకోవచ్చు. ఇలా ఎకరానికి పెట్టుబడి పోను రూ.50 వేల నుంచి రూ.60 వేల ఆదాయం ఆర్జించవచ్చు. అదే వరి సాగు చేస్తే రెండు సీజన్లలోనూ రూ.25 వేలు మిగులుతుంది. దీనిని దృష్టిలో రైతులు సమీకృత సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు సమీకృత వ్యవసాయం చేయాలని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సాహం అందిస్తున్నాం. ఇప్పటికే ఐదారు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. పంట మార్పిడితో కలిగే లాభాలపై చైతన్యం తీసుకు వస్తున్నాం. ఇది రైతులకు లాభసాటిగా ఉంటోంది. – ఎస్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, కాకినాడ

రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు ప్రారంభం



టీటీ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

పెద్దాపురం: రాష్ట్ర స్థాయి టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2024 టీటీ పోటీలు పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏపీ టీటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఉద్దేశించి అసోసియేషన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో క్రీడా ఆసక్తిని పెంపొందించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో టీటీ పోటీలను శ్రీప్రకాష్ పాఠశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కోచ్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 540 మంది క్రీడాకారులు వచ్చారన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో భాగంగా తొలిరోజు అండర్-11, 13, 15 విభాగాల్లో బాలుర, బాలికలు తలపడగా ఫైనల్‌కు ఎంపికలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆయా జిల్లా టీటీ అంపైర్లు, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో చోరీ

పెద్దాపురం: ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి సుమారు పది కాసుల బంగారు ఆభరణాలు, రూ.రెండు లక్షల నగదు చోరీ చేశారు. శనివారం ఈ ఘటన పెద్దాపురం ప్లీడర్స్ వీధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ప్లీడర్స్ వీధికి చెందిన నామా సతీష్ బంధువుల ఇంటికి వెళ్లగా, ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు సొత్తు చోరీకి పాల్పడ్డారు. సీఐ రవికుమార్, ఎస్‌ఐ వెలుగుల సురేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి విచారణ చేపట్టారు.


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: మురమళ్లలోని వీరేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం జ్యేష్ఠ మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. తొలుత గణపతి పూజ, మండపారాధన, రుద్ర హోమం, పూర్ణాహుతి జరిపారు. 26 మంది గోత్రనామాలతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఏర్పాట్లను ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.


మురమళ్ల స్వామి సన్నిధిలో రుద్రహోమం చేస్తున్న పండితుడు

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. పాలకొల్లుకు చెందిన రాయవరపు వెంకట సూర్యనారాయణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని ఇచ్చారు.


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ రమణరాజు

బాధితుడికి మాజీ ఎంపీ భరత్‌రామ్ పరామర్శ


సాయిదుర్గను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడిన యువకుడు పాలిక వెంకట సాయిదుర్గను మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పరామర్శించారు. శనివారం స్థానిక కోటిలింగాలపేట ఆర్తి వీధిలో బాధితుడి నివాసానికి వెళ్లి జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులు రాడ్డుతో దాడిచేసి నాలుగు రోజులైందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను కోరారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన కొల్లి నాని, సింహ బాల, కొల్లి శివలను తక్షణం అరెస్ట్ చేయించాలని అన్నారు. తమకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అండ ఉందంటూ బెదిరిస్తూ, సాయిదుర్గను చంపేస్తామని నిందితులు అంటున్నారని భయాందోళన వ్యక్తం చేశారు. వీరి వెంట నక్కా శ్రీనగేష్ తదితరులు ఉన్నారు.

భక్తులకు సినిమా కష్టాలు

- గేమ్ ఛేంజర్ షూటింగ్‌తో తిప్పలు
- వాడపల్లి క్షేత్రానికి చేరుకోలేక అవస్థలు
- కేవలం ద్విచక్ర వాహనాలకే అనుమతి


పేరవరం రోడ్డుపై సినిమా యూనిట్


పేరవరం వద్ద సినిమా షూటింగ్‌లో రామ్‌చరణ్

ఆత్రేయపురం: అవును.. శ్రీవారి భక్తులకు సినిమా కష్టాలు ఎదురయ్యాయి. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు శనివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 50 వేల నుంచి 60 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అయితే శని, ఆదివారాల్లో సినీనటుడు రామ్‌చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో ఆత్రేయపురం మండలం పేరవరం పరిసర ప్రాంతాల్లో చిత్ర యూనిట్ షూటింగ్ చేసింది. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచి వాడపల్లి వెంకన్న ఆలయానికి చేరుకునే భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి బొబ్బర్లంక మీదుగా బైక్‌లకు తప్ప మిగతా కార్లు, ఇతర వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. ధవళేశ్వరం నుంచి వేమగిరి, రావులపాలెం మీదుగా వాడపల్లికి పోలీసులు ట్రాఫిక్ మళ్లించారు. అలాగే విజ్జేశ్వరం, కొవ్వూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వాడపల్లి చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆర్టీసీ, ఇతర ప్రైవేట్ వాహనాలు ఈ రహదారిలో కాకుండా రావులపాలెం మీదుగా రాకపోకలు సాగించాయి. సినిమా షూటింగ్‌లకు అనుమతులు ఇచ్చే ముందు అధికారులు వాడపల్లికి చేరుకునే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిందని పలువురు కోరారు.

మరో రెండు రోజుల చిత్రీకరణ

మండలంలోని పేరవరం ధనలక్ష్మీ దానవాయమ్మ ఆలయం వద్ద గేమ్ ఛేంజర్ చిత్రీకరణ జరిగింది. హీరో రామ్‌చరణ్, సునీల్, రఘు తదితరులతో దర్శకుడు శంకర్ గ్రామంలో రోడ్ల ఆక్రమణపై ఓ సన్నివేశాన్ని చిత్రీకరించారు. మరో రెండు రోజుల పాటు ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో సినీ షూటింగ్ ఉంటుందని శంకర్ తెలిపారు.

వ్యాన్ బోల్తా: ఐదుగురికి గాయాలు

జగ్గంపేట: మండలంలోని రామవరం వద్ద బొలేరో వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఆ వివరాల్లోకి వెళితే.. నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన నిమ్మల లక్ష్మి, షేక్ నాగూర్‌మీరా, చిలకల రామలింగేశ్వరరావు, వట్టి నాగరాజులు వంట పనులు చేస్తుంటారు. తెలంగాణ నుంచి విశాఖ వైపు వెళుతున్న టూరిస్టు బస్‌లో ప్రయాణించే వారికి ఆహార పదార్థాలు వండి ఇచ్చేందుకు కాంటాక్టుకు కుదిరారు. ఈ నేపథ్యంలో టూరిస్టు బస్సు వెనకాలే వీరి వ్యాన్ ప్రయాణిస్తోంది. రామవరం వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తూ వ్యాన్ బోల్తా పడింది. దీంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. వీరిని జగ్గంపేట సీహెచ్‌సీకి హైవే అంబులెన్స్‌లో తరలించి చికిత్స అందించారు.